ప్రజాశక్తి

గురువారం 18 జనవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అయినసూ ఆ పార్టీలో చేరెదను!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

◆ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేసే బిజెపి 'చెర'లోనే జనసేన!

◆ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌తో కొణతాల భేటీ!

◆చేరికపై మంచిరోజు కోసం నిరీక్షణ?

విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి ఆయన్ను కలవడం తాజాగా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వారిద్దరూ కలిసి ముచ్చటించుకున్న విషయాలేమిటి? ఉత్తరాంధ్ర ప్రాంత ప్రధాన సమస్యలపై ఏమైనా చర్చ సాగిందా? ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపైనా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఏమైనా చర్చించారా? లేదా జనసేన పార్టీలో చేరడం కోసమే పవన్‌ను ప్రసన్నం చేసుకున్నారా? అనేది తెలియాల్సి ఉంది. యావత్ ఏపికే తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర బిజెపి పెద్దలతో తాను బంధం కొనసాగిస్తున్నట్లు చెప్పుకునే 'జనసేన' అధినేతతో సమస్యలపై పోరాడిన కొణతాల భేటీ ఏమిటి? అన్న చర్చా నడుస్తోంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో సమస్యల గురించి ప్రత్యేకంగా పవన్ అడిగేదేమిటి? కొణతాల చెప్పేదేముంటుంది? ఢిల్లీ, గల్లీ స్థాయిలో ఏపి విభజన హామీల కోసం గతంలో పలు వేదికల్లో ప్రశ్నించిన కొణతాల జనసేన నేతతో భేటీ రాజకీయ టాపిక్‌గా మారింది.

ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేసినా...

వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసిన బిజెపి కేంద్ర పెద్దలతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పుకునే జనసేనానితో

పవన్ కల్యాణ్‌ను కలిసిన కొణతాల రామకృష్ణ

ఏ విధంగా కొణతాల భేటీ అయ్యారు? ఏపికి హోదా ఇవ్వకుండా, రైల్వే జోన్ ప్రకటించి పనులు చేపట్టకుండా, బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఏపిలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలకు హామీ ఇచ్చి నెరవేర్చని బిజెపితో బంధం తెగతెంపులు చేసుకోనంటూ బాహాటంగా చెబుతున్న జనసేనతో ఎలా జతకడతారు? అన్నది విశాఖ ఉమ్మడి జిల్లాలోని రాజకీయ పార్టీలు, పరిశీలకులు నివ్వెరపోతున్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు ప్రధానకారణమైన బిజెపితో చెలిమి చేసే జనసేనలో చేరడం వెనక ఆంతర్యం ఏమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆ జిల్లాలో వారిద్దరూ వేర్వేరు ధృవాలు..

మరోవైపు అనకాపల్లి జిల్లాలో మరో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఇప్పటికే టిడిపి తీర్థం పుచ్చుకున్న సంగతి కూడా తెలిసిందే. ఈ ఇద్దరు నాయకులూ ఎప్పుడూ ఒకే పార్టీలో ఉండరన్నది తెలిసిందే. 80వ దశకం నుంచీ నేటివరకూ రాజకీయాల్లో చెరో దిక్కుగా ఉంటూ 2024 ఎన్నికల్లో కూడా ఇంచుమించు అదే దూరాన్ని పాటించేందుకు పార్టీలతో మమేకం అవ్వడం కనిపిస్తోంది. అయితే టిడిపి, జనసేన కలిసే ఈ ఎన్నికల్లో వైసిపిని ఎదుర్కోవాలని ముందుకు సాగుతున్న విషయం ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఉత్తరాంధ్ర రాజకీయాలు, సామాజిక పరిస్థితులపై కొంత మేరకు అవగాహన కలిగిన నాయకునిగా కొణతాలకు పేరుంది. పవన్ కల్యాన్ తాజా పరిస్థితులపై ఈయన్ను బుధవారం ఆరా తీసినట్లు

మిగతా 2లో..

మిలాన్ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నేవల్ కమాండ్ ఆధ్వర్యాన ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లుగా నిర్వహించే మిలాన్ - 2024 వేడుకల విజయవంతానికి ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. సిరిపురంలోని విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నేవీ, ఎయిర్ పోర్టు, పోర్ట్ అథారిటీ, కస్టమ్స్, రెవెన్యూ, విఎంఆర్‌డిఎ, జివిఎంసి పోలీసు, పర్యాటక శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా మిలాన్ - 2024 ఇన్‌ఛార్జి, నేవల్ కమోడో సిరజ్ అజాద్ 12వ ఎడిషన్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 19 నుంచి 23వ తేదీ వరకు హార్బర్ ఫేజ్, 24 నుంచి 27వ తేదీ వరకు సీ ఫేజ్ మిలాన్ -2024 కార్యక్రమాలు జరుగుతాయని, దీనికి దేశ విదేశాల నుంచి అతిథులు విచ్చేస్తున్నారని వివరించారు. ఉప రాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. 50 విదేశీ నౌకలు, 40 వరకు యుద్ధ నౌకలు, సబ్ మెరైన్లు మిలాన్ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 18, 19 తేదీల్లో దేశ, విదేశాల నుంచి వచ్చే నౌకలు విశాఖపట్టణం పోర్టు, నేవల్ డాక్ యార్డుకు చేరుకుంటాయని చెప్పారు. 19వ తేదీన విదేశీ ప్రముఖులు నగరానికి విచ్చేస్తారని పేర్కొన్నారు. 21వ తేదీ నుంచి ప్రధాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. నేవల్ ఆడిటోరియం సముద్రికలో 21న హార్బర్ ఫేజ్ వేడుకలు ప్రారంభమవుతాయని సిరజ్ అజాద్ వివరించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి చేతుల మీదుగా నేవల్ బేస్‌లో అదే రోజు సాయంత్రం మిలాన్ విలేజ్ ప్రారంభోత్సవం కూడా ఉంటుందన్నారు. 22వ తేదీన ఉప రాష్ట్రపతి విచ్చేసి సముద్రికలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. అదే రోజు సాయంత్రం బీచ్ వేదికగా జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విచ్చేసి వేడుకల్లో భాగస్వామ్యం అవుతారని వెల్లడించారు.

మిలాన్ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ మిలాన్ - 2024 వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వివిఐపి, విఐపిల రక్షణ ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు చెప్పారు. సమావేశంలో కమోడో రాజ్ నీష్ శర్మ, పలువురు నేవీ కమాండర్లు, లెఫ్టినెంట్ కమాండర్లు, డిసిపి శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, డిఎఫ్ఒ, విఎంఆర్‌డిఎ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

ఎయు వీసీగా ప్రసాదరెడ్డి నియామకం

▶ వార్త మెయిన్‌లో..

వాల్తేరు డివిజన్‌కు 5 సమర్థత అవార్డులు

▶ వార్త మెయిన్‌లో..

మహోన్నత నేత జ్యోతిబసు : లోకనాథం

▶ వార్త 5లో..

భారత్, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

▶ వార్త 3లో..

షోకాజ్ నోటీసుకు సమాధానమిచ్చేందుకు మర్రిపాలెం అర్బన్ ప్రాజెక్టు కార్యాలయానికి వచ్చిన అంగన్‌వాడీలు

షోకాజ్ నోటీసులకు సమాధానాలు

వేతనాలు పెంచే వరకూ సమ్మె విరమించం : అంగన్‌వాడీలు వార్త 8లో..

బాలకృష్ణ మృతి ఉద్యమానికి తీరనిలోటు

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- అనకాపల్లి

ఉమ్మడి విశాఖ జిల్లాలో సిపిఎం పార్టీకి పునాది లాంటి అంగులూరి బాలకృష్ణ మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి, సిపిఎంకు తీరని లోటని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పేర్కొన్నారు. అనకాపల్లిలోని గవరపాలెం ముదిరాజ్ కాలనీలో బుధవారం సిపిఎం అనకాపల్లి మండల కార్యదర్శి గంట శ్రీరామ్ అధ్యక్షతన బాలకృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ఎంవిఎస్.శర్మ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. బాలకృష్ణ చిన్నతనం నుంచి అభ్యుదయ భావాలతో పెరిగారన్నారు. విద్యార్థి ఉద్యమాలతో ప్రారంభమైన ఆయన జీవిత గమనం వామపక్ష ఉద్యమాలతో మమేకమై సాగిందని వివరించారు. విద్యార్థి, కార్మిక, వ్యవసాయకార్మిక సంఘం, రైతు ఉద్యమాల బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా

బాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంవిఎస్.శర్మ, లోకనాథం తదితరులు

నిర్వహించారని పేర్కొన్నారు. సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్‌గా బహుముఖ కార్యక్రమాలతో జిల్లాలో ప్రజాదరణ ఉన్న నాయకుని మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని నష్టమన్నారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ, బాలకృష్ణ తన జీవితకాలం ప్రజా సమస్యలపై పోరాడారన్నారు. చనిపోయిన తరువాత తన పార్థివ దేహాన్ని ప్రజా ఉపయోగార్థం విశాఖపట్నం కెజిహెచ్ అనాటమీ విభాగానికి తన కుటుంబ సభ్యుల ద్వారా అప్పగించి చిరస్థాయిగా నిలిచిన ఏకైక వ్యక్తి అని కొనియాడారు. మధుమేహ వైద్య పరిశోధనల

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అయిననూ ఆ పార్టీలో చేరెదను!

భోగట్టా. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి జనసేన నుంచి కొణతాల పోటీకి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా జనసేన పార్టీలో తాను చేరనున్నట్లు ఆయన అనుచరుల వద్ద ఇప్పటికే కొణతాల వెల్లడించారని తెలిసింది.

కొణతాల రాజకీయ ప్రస్థానం...

ఉత్తరాంధ్రలో బిసి నాయకుడిగా కొణతాల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. 1989 నుంచి 1996 వరకూ అనకాపల్లి పార్లమెంట్ సభ్యునిగానూ తర్వాత 2004 నుంచి 2009 వరకూ వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో కమర్షియల్ టాక్స్ మంత్రిగా పనిచేశారు. 2019 తర్వాత వైసిపిలో కూడా చేరి పొలిటికల్ ఎఫైర్స్ కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికలనంతరం కొణతాల రాజీనామా చేశారు. తాను రాజకీయాలకు దూరం అంటూ ప్రకటించారు. ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాడుతానని ఉత్తరాంధ్ర చర్చా వేదిక తరపున పలు సమావేశాలు నిర్వహించి పర్యటనలు కూడా చేశారు. విశాఖపట్నం రైల్వే జోన్ సాధన ఉద్యమంలోనూ కమ్యూనిస్టు పార్టీలతో కలిసి పనిచేశారు. ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్న పోరాటంలోనూ ఏపి హైకోర్టులో పిల్ వేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ బిజెపిపై పోరాడడం లేదని, హోదా సాధించలేకపోయిందని విమర్శలు చేశారు. తాజాగా జనసేన (బిజెపి సన్నిహిత పార్టీ)తో కలిసిపోవాలని కొణతాల ఆసక్తిగా ఉన్నట్లు, మంచిరోజు కోసం నిరీక్షిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

బాలకృష్ణ మృతి ఉద్యమానికి తీరని లోటు

కోసం ఆయన మృతదేహాన్ని అప్పగించారన్నారు. బాలకృష్ణ పేరుపై ఇకపై ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ సంతాప సభలో మాజీ ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సిపిఐ ఎంఎల్ జిల్లా కన్వీనర్ పిఎస్.అజయ్‌కుమార్, సిపిఐ నాయకులు వైఎన్.భద్రం, కాంగ్రెస్ నాయకులు ఐఆర్.గంగాధర్, డైట్ విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, డావెన్సి స్కూల్ కరస్పాండెంట్ కర్రి సుందరయ్య, సిపిఎం నాయకులు విఎస్.పద్మనాభరాజు, ప్రజా సంఘాల నాయకులు బాలు గాడి, కనిశెట్టి సురేష్, మాజీ ఎంపిపి కె.వెంకట్, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్‌కెఎస్‌వి.కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, గండి నాయన బాబు, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు గుడాల సత్యనారాయణ ముదిరాజ్, ఆప్ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, దళిత సంఘాల సమాఖ్య నాయకులు మర్ర చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, తేలయ్యబాబు, భూషణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు .

బొత్స దంపతులను కలిసిన వాసుపల్లి , కోలా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి కాలనీ : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ అంశాలపై మంత్రి బొత్స సత్యనారాయణతో కాసేపు చర్చించారు.

ఝాన్సీని కలిసిన కోలా గురువులు

ఎంవిపి కాలనీ : విశాఖ వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని, మంత్రి బొత్స సత్యనారాయణను వారి నివాసం వద్ద విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షులు కోలా గురువులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. విశాఖ లోక్‌సభ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిస్థితులపై చర్చించారు.

నేడు విశాఖకు ఎన్నికల జాబితా పరిశీలకులు శ్యామలరావు రాక

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా ఎన్నికల జాబితా పరిశీలకులు, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గురువారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు విశాఖపట్టణం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇఆర్‌ఒలు, ఇతర అధికారులతో ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

YELAMANCHILI MUNICIPALITY
TENDER NOTICE

ROC.No. 521/2023-24/E1, Date : 17-01-2024

Yelamanchili Municipality invited following tender via 'e'procurement Platform for taking up development works under GGMP, 15th FC Grants & General Fund

Total No. of Works	:	**40 Works**
Total Estimates Value	:	**Rs. 174.30 Lakhs**
Total ECV	:	**Rs. 142.37 Lakhs**
BID Starting Date & Time	:	**17-01-2024 by 11:00 AM**
BID Ending Date & Time	:	**24-01-2024 by 03:00 PM (37 Works)**
BID Ending Date & Time	:	**02-02-2024 by 03:00 PM (3 Works - 1st Call)**

For details logon to: **www.apeprocurement.gov.in**
Contacts Ph.No. **7337224401, 7334224407**

K.A.KONDALA RAO, COMMISSIONER
YELAMANCHILI MUNICIPALITY

స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని వినతి

మున్సిపల్ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యు.రాజు తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలోని ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్, హైలీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతికి బుధవారం యూనియన్ తరపున వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 16 రోజులు చేసిన సమ్మె సందర్భంగా మున్సిపల్ రంగంలో ఇంజినీరింగ్ కార్మికులకు హైలీ స్కిల్ వేతనాలు చెల్లించాలని ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిందన్నారు. ఈ సమ్మెలో ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేసిందని, ఈ కమిటీకి కన్వీనర్‌గా శివపార్వతి (డిప్యూటీ డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్)ను నియమించారని, బుధవారం అమరావతిలో ఆమెను కలసి యూనియన్ తరపున వినతిపత్రం అందించినట్లు తెలిపారు. జివిఎంసి, వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు డి.శంకర రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రవణ్, రాష్ట్ర సీనియర్ నాయకులు సోమయ్య కలిసి జివిఎంసి పరిధిలో నీటి సరఫరా, వెటర్నరీ, ఆర్టికల్చర్ పార్కులు, క్లాప్ డ్రైవర్లు, ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సెమి స్కిల్డు, స్కిల్డ్, హైలిస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించి వివరించినట్లు తెలిపారు. పనిముట్లు యంత్రాలపైన పనిచేసే కార్మికులకు ఒక సంవత్సరం అనుభవం ఉన్న వారికి సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, ఐటిఐ క్వాలిఫికేషన్ ఉన్నవారికి స్కిల్డ్ వేత్తనాలు, డిప్లమో, డిగ్రీ క్వాలిఫికేషన్ ఉన్న వారికి హైలి స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మద్యం పంపిణీపై చర్యలు తీసుకోవాలి

సీతంరాజు సుధాకర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు చెందిన రామబాణం కళాశాలలో కనుమ పండగ సందర్భంగా మద్యం, కోళ్ల పంపిణీ చట్ట వ్యతిరేకంగా జరిగిందని, దీనిపై ఎక్సైజ్ పోలీసులు చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఇటీవల వైసిపికి రాజీనామా చేసిన సీతంరాజు సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని ఒక హోటల్లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తీరుపై ధ్వజమెత్తారు. డిఫెన్స్ ఉద్యోగాలకు వెళ్లేందుకు శిక్షణ తీసుకునే విద్యార్థులు కూర్చునే తరగతి గదుల్లో 400 మద్యం బాటిళ్లు, బతికి ఉన్న కోళ్ల పంపిణీ చేస్తున్న వైనానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ అయ్యాయని ఆరోపించారు. వాటి పంపిణీ సమయంలో ఎమ్మెల్యే గణేష్ కళాశాల పైఫ్లోర్‌లో ఉన్న కార్యాలయంలోనే ఉన్నారని, ఎమ్మెల్యే లెటర్ హెడ్‌పై టోకెన్ నెంబర్లు ఉన్నవారికి మాత్రమే పంపిణీ జరిగిందని తెలిపారు. విద్యాశాఖ, ఎక్సైజ్ పోలీసు నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిన ఈ వ్యవహారంలో ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. దక్షిణ నియోజకవర్గంలో అనేకమంది వైసిపి కార్పొరేటర్లు వాసుపల్లికి వ్యతిరేకంగా ఉన్నారని, త్వరలోనే వారు పార్టీని వీడుతారని చెప్పారు. విశాఖ నగర పరిధిలో పెద్ద నాయకులు కూడా వైసిపిని వీడి మరో పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, బిపిన్ కుమార్ జైన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకటరావు, నాయకులు జబ్బీర్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో డిజిటలైజేషన్ ఎలక్ట్రానిక్ ల్యాబ్ రిపోర్టులు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలయందు డిజిటలైజేషన్, ఎలక్ట్రానిక్ ల్యాబ్ రిపోర్టులను బుధవారం ప్రారంభించారు. రక్త పరీక్షలు ల్యాబ్ నందు చేసిన తర్వాత, ఆ ల్యాబ్ సంబంధిత వైద్యులు లాగ్ ఇన్‌లో కంప్యూటర్‌లో చూసేందుకు దోహదపడే అత్యంత ఆధునిక సౌకర్యం దీంతో లభించిందని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మీడియాకు తెలిపారు. ఈ విధానం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రోగులు రిపోర్టు గురించి ల్యాబ్ కు తిరగకుండా, వైద్యుల దగ్గరికి నేరుగా వెళ్లి చికిత్స చేయించుకోడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.రాధాకృష్ణన్, డాక్టర్ లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్

పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగన్ దళిత ద్రోహి అని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. జిల్లా టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వంలో అప్పులు ఉన్నాయి కానీ అంబులెన్స్‌లు మాత్రం లేవన్నారు. గిరిజన ప్రాంతంలో డోలి మోత తప్పడం లేదన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో ఫిడర్ అంబులెన్స్ ఏర్పాటుచేశామని, వాటిని వైసిపి ప్రభుత్వం మూలన పడేసిందన్నారు. వైసిపి వచ్చాక వైద్య రంగం నేల చూపులు చూస్తోందన్నారు. గిరిజన ప్రాంతంలో మృతదేహాన్ని డోలీలో తీసుకు వెళ్లాల్సి రావడం బాధాకరమన్నారు. దళిత డ్రైవర్ సుబ్రమణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసిన నిందితుడు ఆనందబాబును సిఎం నేరుగా పక్కన కూర్చో బెట్టుకుంటున్నారని ఆరోపించారు. ఐదేళ్లు నుంచి ఒక్క సారి కూడా కోడి కత్తి కేసులో సాక్షిగా హాజరు కావడానికి జగన్మోహన్‌రెడ్డికి ఖాళీ లేదా అని ప్రశ్నించారు. కోడికత్తి కేసులో శ్రీనివాసరావు జైలులో నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఎన్నికలో వైసిపికి ఘోరి కట్టడానికి దళితులు, రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.117/2023 in O.S.62/2023

Between:
Maadu Thataji ...Petitioner/Plaintiff
And:
Sri Chettupalli Gopi & another ...Respondents/Defendants

NOTICE

To,
R-1:Sri Chettupalli Gopi,
S/o Chettupalli Kanaka Rao,
Hindu, aged about 50 Years,
R/at D.No.1-185, Durga Nagar,
Yendada Village, Durga Nagar,
Visakhapatnam-530045.

Please take notice that the above named petitioner/ plaintiff has instituted the above I.A.117/2023 in O.S.62/2023 for grant ad-interim exparty temporary injunction restraining you and another respondent from alienating or transferring the petition schedule property and the matter stands posted to **30-01-2024** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte as per law.

(By order of the Hon'ble Court)
K. SAILESH PRASAD,
Advocate
Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.118/2023 in O.S.62/2023

Between:
Maadu Thataji ...Petitioner/Plaintiff
And:
Sri Chettupalli Gopi & another ...Respondents/Defendants

NOTICE

To,
R-1: Sri Chettupalli Gopi,
S/o Chettupalli Kanaka Rao,
Hindu, aged about 50 Years,
R/at D.No.1-185, Durga Nagar,
Yendada Village, Durga Nagar,
Visakhapatnam-530045.

Please take notice that the above named petitioner/plaintiff have filed an application I.A.118/2023 in O.S.62/2023 for temporary injunction restraining you, your men and agents from ever interfering with their peaceful possession and enjoyment of the petition schedule property till the disposal of suit and the same stands posted to **30-01-2024** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte, as per law.

(By order of the Hon'ble Court)
K. SAILESH PRASAD, Advocate
Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIORCIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.62/2023

Between:
MaaduThataji ... Plaintiff
And:
Sri Chettupalli Gopi & another ...Defendants

SUMMONS

To,
Defendant No.1:
Sri Chettupalli Gopi,
S/o Chettupalli Kanaka Rao,
Hindu, aged about50 Years,
R/at D.No.1-185, Durga Nagar,
Yendada Village, Durga Nagar,
Visakhapatnam-530045.

Please take notice that the above matter O.S.62/2023 filed by the plaintiff for cancellation of sale deed and the suit stands posted to **30-01-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble court either in person orthrough duly instructed Advocate on **30-01-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and the determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K.SAILESH PRASAD,
Advocate
Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE PRINICIPAL SENIOR CIVIL JUDGEAT: VISAKHAPATNAM
O.S.268/2023

Between:
Smt. Rokkam Sudha Lakshmi ...Plaintiff
And:
Singamsetti Gnanesh ...Defendant

SUMMONS

To,
The Defendant:
Singamsetti Gnanesh,
S/o.Singamsetti Murali
Venkata Krishna Rao,
R/o.D.No. 49-14-10,
Sri Maye Nilayam, Lalitha Nagar,
Visakhapatnam-530016.

Take notice that the plaintiff has filed the above suit seeking Cancellation of the settlement deed Dt.30.06.2022 registered as document No.3728/2022, in SRO, Dwarakanagar, Visakhapatnam and for other reliefs. As you are intentionally avoiding service of summons on you, the Hon'ble Court was pleased to order issuance of summons to you by way of paper publication. You are here by summoned to appear before the above-mentioned Court on **29-01-2024 at 10:30 A.M. in** person or through an Advocate duly instructed to answer all the material questions relating to the above matter or else the matter will be heard and determined in your absence.

"By Order of the Court"
T. PARTHA SARADHI,
Advocate
Visakhapatnam

భారత్, ఇంగ్లాండ్ రెండో క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌కు

ఆన్‌లైన్‌లో జోరుగా టికెట్ల విక్రయాలు

- 26 నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయం
- ఆందోళన వద్దు అందుబాటులో అన్ని రకాల టికెట్లు
- రోజుకు రెండు వేలమంది చొప్పున విద్యార్థులకు ఫ్రీ ఎంట్రీ
- ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు సిరీస్‌లో భాగంగా విశాఖపట్నం ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియం వేదికగా వచ్చేనెల 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య 2వ అంతర్జాతీయ క్రికెట్ టెస్టు మ్యాచ్ కోసం అన్ని రకాల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 26 నుంచి ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లుఅందుబాటులో ఉంటాయని, ప్రేక్షకులు, క్రికెట్ అభిమానులు ఆందోళన చెందవద్దన్నారు. ఈ నెల 15నుంచి పేటిఎం యాప్, insider.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విక్రయం ప్రారంభించిన రెండురోజుల్లో 3 వేల టికెట్ల అమ్ముడుపోయాయన్నారు. క్రికెట్ టెస్ట్‌మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఒక రోజు మ్యాచ్‌కు రూ. 100, రూ. 200, రూ. 300, రూ. 500 విలువ చేసే టిక్కెట్లు, అదేవిధంగా 5 రోజులకు కలిపి రూ. 400, రూ. 800, రూ.1,000 విలువ చేసే టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.1,500 టికెట్లు ఆన్‌లైన్‌లో అయిపోయినప్పటికీ ఆఫ్‌లైన్ ద్వారా విక్రయించే కౌంటర్లలో కొనుగోలు చేయొచ్చని సూచించారు..ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసేవారు insider.in అనే వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే అందులో సీజన్ పాస్, 'డే' (రోజు వారీ) టికెట్లకు సంబంధించి రెండు ఆప్షన్లు కన్పిస్తాయని, ప్రేక్షకులకు తమకు నచ్చిన ఆప్షన్‌ను ఎంచుకుని టిక్కెట్‌ను పొందవచ్చన్నారు.

26 నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

భారత్, ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్ కోసం ఆఫ్‌లైన్ ద్వారా ఈ నెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు పీఎం.పాలెంలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియం వద్ద అలాగే ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు స్వర్ణభారతి ఇండోర్‌స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లు అందుబాటులో ఉంటాయని ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. 13,382 టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలోని క్రికెట్ క్లబ్ క్రీడాకారుల కోసం 2,850 టికెట్లు, రోజుకు రెండు వేల మంది చొప్పున ఐదు రోజుల్లో 10 వేల మంది విద్యార్థులకు ఉచిత ఎంట్రీ ఇస్తామన్నారు. అయితే విద్యార్థులు ఐడీ కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు రాయితీపై టికెట్లు..

రాష్ట్రంలోని 2,850 మంది క్రికెట్ క్లబ్ క్రీడాకారులకు రాయితీపై రూ. 250లకు ఐదు రోజుల పాటు మ్యాచ్‌ను తిలకించే అవకాశం కల్పిస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా లోయర్ పెవిలియన్ సీజన్ టికెట్లను విశాఖపట్నంలో కేవలం రూ.1500లకు అందుబాటులో ఉంచినట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘననివాళి

శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పిస్తున్న శ్రీధర్, తదితరులు

ప్రజాశక్తి- వేపగుంట : ఆంధ్రభోజుడు శ్రీకృష్ణ దేవరాయల జయంతిని కాకానినగర్ ప్రాంతంలోని కాపు, తెలగ, బలిజ సామాజిక భవనంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణదేవరాయల చిత్రపటానికి పలువురు ప్రముఖులు, కాపు సామాజిక వర్గం నేతలతో కలిసి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, రాజుగా, పండితునిగా శ్రీకృష్ణదేవరాయలు విశిష్టత, సేవలను కొనియాడారు.

19న అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ప్రజాశక్తి -ఆనందపురం: ఈ నెల 19న విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పెద్దఎత్తున అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని భీమిలి డివిజనల్ ఎస్‌సి,ఎస్‌టి కమిటీ సభ్యుడు దుమ్మెద అప్పలసూరి కోరారు. విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 125 అడుగుల ఎత్తైన భారీ అంబేద్కర్ విగ్రహం దేశానికే తలమానికంగా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించే కార్యక్రమానికి నియోజకవర్గంలోని అంబేద్కర్ అభిమానులు తరలిరావాలని కోరారు.

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

ప్రజాశక్తి-పద్మనాభం: మండల కేంద్రమైన పద్మనాభంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి కృష్ణాపురం గ్రామానికి చెందిన సుంకర అచ్చంనాయుడు దంపతులు రూ.20 వేల ఆర్థిక సహకారాన్ని అందించారని ఆలయకమిటీ ప్రతినిధి శ్రీను తెలిపారు. దాతలకు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛ తీర్థంలో ఆలయ శుద్ధి

ప్రజాశక్తి- సింహాచలం: స్వచ్ఛ తీర్థంలో భాగంగా బుధవారం సింహాచలం ప్రధానాలయంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేశారు. దేవస్థానం ఇఇ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎఇఒబ్రమరాంబ, అన్నదానం ఎఇఒ నర్సింగరావు, శానిటరీ పర్యవేక్షణాధికారి లక్ష్మీప్రసన్న సానిటరీ సూపర్వైజర్ రామకృష్ణ, ఆలయ పర్యవేక్షణాధికారి కనకరాజు ఆధ్వర్యంలో అంతరాలయం, బేడామండపం, ఆస్థాన మండపం భోగమండపం శుద్ధి చేశారు. లంక సూరిబాబు, నక్క సత్యారావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

రమణమ్మ తీర్థంలో వివిధ పోటీలు

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న రమణమ్మ తల్లి తీర్థంలో వివిధ పోటీలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా రమణమ్మ పేరంటాలకు భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించారు.

ఈ సందర్భంగా పిల్లలు, యువత, ఆడపడు చులకు ముగ్గులు, క్రికెట్, కబడ్డీ రన్నింగ్, పలు సాంప్రదాయ క్రీడలపోటీలను నిర్వహించారు. విజేతలకు ఎఎస్‌పి అనిల్‌కుమార్, ఎజిపి చిన్నయ్యపాత్రుడు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు ఉప్పాడ అప్పారావు, విఆర్‌ఒల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు పోతిన వెంకట అప్పారావు, కూరాకుల వెంకటేష్, మురళి, గుండు నానాజీ, పల్లి పైడి సత్యం, మరుపిళ్ల ప్రసాద్ వెంకటేష్, శ్రీనివాసరావు సారిక ఆదినారాయణ, ఆకుల జగదీశ్వరరావు, గుండు గోవిందరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మరుపిళ్ల పద్మజ, సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ, తీర్థనిర్వాహకుడు భావిశెట్టి రాజు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

ఆరోగ్యసురక్ష రిపోర్టు ఇస్తున్న కార్పొరేటర్ దేముడు

ప్రజాశక్తి- వేపగుంట : జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు అన్నారు. బుధవారం 499సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆరోగ్యసురక్ష శిబిరంలో మాట్లాడుతూ, ఇంటింటికీ మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో సిఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. ముందుగా పిహెచ్‌సి సిబ్బందితో సర్వే చేయించి, దీర్ఘకాలిక, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి గుర్తించి, వారికి మెరుగైన ఆరోగ్యసేవలను అందిస్తున్నా రన్నారు. వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రేయ, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, వైద్యసిబ్బంది, వైసిపి నేతలు రాము, సంతోష్, ఐటిఐ మాస్టారు, మేడిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

540 మంది ఆరోగ్య సురక్ష వైద్యసేవలు

భీమునిపట్నం : స్థానిక చిన్న బజారు వార్డు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. 540 మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. శిబిరానికి 351 మంది మహిళలు, 189 మంది పురుషులు,14 మంది పాఠశాల విద్యార్థులు, 8 మంది గర్భిణులు హాజరై వైద్య సేవలు పొందారు. 87 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగులో భాగంగా 32 మందికి కళ్లద్దాలు అందజేశారు

విహారయాత్రలో విషాదం

- యువకులపైకి దూసుకెళ్లిన బొలేరో

- ఒకరు మృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి-అనంతగిరి : సంక్రాంతి పండుగ అనంతరం విహారయాత్రకు వెళ్లిన పర్యాటకులకు విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బుధవారం విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం మర్రపల్లి గ్రామానికి చెందిన 12 మంది యువకులు కలిసి ఎన్ఆర్ పురం పంచాయతీ పరిధిలో ఉన్న వాటర్ తిలకించేందుకు వెళ్లారు. తిలకించిన అనంతరం రహదారిపైకి వచ్చి గట్టుపై సేద తీరుతున్న సమయంలో బొలెరో వాహనం వారిపైకి దూసుకు పోవడంతో అదే గ్రామానికి చెందిన కళ్యాణ్ (25) మృతి చెందినట్లు తెలిసింది.మరో ఇద్దరికి తీవ్రమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురికి తీవ్రగాయాలు వీరికి ప్రథమ చికిత్స నిమిత్తం ఎస్. కోట ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయగా వైద్య సేవలు అందించిన అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించవలసి ఉంది.

జనసేనలో పలువురి చేరిక

గాజువాకలో అనుచరులతో జనసేనలోకి సూరిబాబు

ప్రజాశక్తి- గాజువాక : వైసిపి 70వ వార్డు అధ్యక్షులు కురిటి వెంకటసూరిబాబు బుధవారం జనసేన పార్టీలో చేరారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో పిఎసి సభ్యులు, గాజువాక ఇన్‌ఛార్జి కోన తాతారావు పార్టీ కండువా వేసి సూరిబాబును పార్టీలోకి ఆహ్వానించారు. సూరిబాబుతోపాటు సుమ, మరో 15మంది అనుచరులు జనసేనలో చేరారు. కప్పుకున్నారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతం నచ్చి జనసేనలో చేరామని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ అభివద్ధికి గాజువాకలో కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

ఆనందపురం: జనసేన పార్టీ రూరల్ కార్యాలయంలో మండల ప్రధానకార్యదర్శి కోరుకొండ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం కణమాం పంచాయతీ నుంచి 30 మంది పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కార్యదర్శి మజ్జి శ్రీను, వార్డు అధ్యక్షులు శ్రీనుబాబు, మండల పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, సెక్రటరీలు సన్యాసి రావు, గోవింద్, బంగారు నాయుడు, గనిశెట్టి లోకేష్, వార్డు సభ్యులు అప్పలసూరి ,అప్పలరాజు, గంగరాజు, గిరిరాజు, నరేష్, తరుణ్ పాల్గొన్నారు.

పవన్ సమక్షంలో జనసేనలోకి కంచిపాటి

వేపగుంట : పెందుర్తి మాజీ జెడ్‌పిటిసి, కాంగ్రెస్ నేత కంచిపాటి విశ్వనాథనాయుడు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. విజయవాడలోని జనసేన కార్యాలయంలో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశ్వనాథనాయుడు జెడ్‌పిటిసిగా వ్యవహరించారు. 2019ఎన్నికల్లోనూ అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీచేసే అవకాశం వచ్చినప్పటికీ అనివార్య కారణాల వలన పోటీ నుంచి వైదొలిగారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ముఖ్యనేత కావడంతో, కంచిపాటి చేరికతో పార్టీకి లాభిస్తుందని భావిస్తున్నారు. కాగా కంచిపాటికి రానున్న ఎన్నికల్లో ఎక్కడినుంచైనా పోటీకి అవకాశం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాలినడక వంతెన నిర్మాణం
బాలల విజయం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ కూడలిలో చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై కాలినడక వంతెన నిర్మాణానికి ప్రభుత్వం, జివిఎంసి శ్రీకారం చుట్టడం బాలల విజయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. రూ.2.5.కోట్లతో 50 అడుగుల పొడుగు,10 అడుగుల వెడల్పు, 22 అడుగుల ఎత్తుతో మరో రెండు నెలల్లో ఈ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వినియోగంలోకి రానుందన్నారు.

చంద్రపాలెం హైస్కూల్ వద్ద జాతీయ రహదారి దాటే క్రమంలో విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి జగన్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాతీయ రహదారుల విభాగం జాతీయ, రాష్ట్ర ఉన్నతాధికారులకు పలుమార్లు కమిషన్ తరపున విన్నవించడంతోపాటు లేఖలను సమర్పించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కూడా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు విశేష కృషి చేయడంతో ఎట్టకేలకు సాకారమైంది. ఈ మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టితోపాటు జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులకు కమిషన్ తరపున అభినందనలు తెలిపారు.

సింహాద్రి అప్పన్నను దర్శించిన
పార్లమెంటరీ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- సింహాచలం : సింహాద్రి అప్పన్నను పెట్రోలియం స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ రమేష్‌తోపాటు ఏడుగురు మంది పార్లమెంటు సభ్యులు ఎంకె రాఘవన్, రవిచంద్ర, రొద్మల్ నాగర్, కంఠ కర్ణం, నారంభై కచ్ఛాడియ, చింతా అనురాధ, మిత్లేష్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం శేష వస్త్రంతో సత్కరించి స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్రంలోని దేవాలయాల పరిశుభ్రతకు ప్రధాని మోడీ పిలుపుమేరకు స్వచ్ఛ తీర్థల్లో భాగంగా ఆలయశుద్ధి కార్యక్రమంలో పార్లమెంటరీ కమిటీ బృందం పాల్గొంది. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఇఇ రాంబాబు, ఎఇఓ భ్రమరాంబ పాలూరి నర్సింగరావు, ఎఇ శ్రీహరిరాజు, పర్యవేక్షణాధికారి కనకరాజు పాల్గొన్నారు

నేడు పద్మనాభం మండల సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న గురువారం మధ్యాహ్నం 2గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ కె.ప్రభాకరరావు తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, జెడ్‌పిటిసితోపాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. మండల పరిధిలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో మండల సభకు హాజరు కావాలని కోరారు.

'జై భారత్' నియోజకవర్గ కన్వీనర్‌గా అనిల్‌కుమార్

అనిల్‌కుమార్‌కు నియామక పత్రం ఇస్తున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జై భారత్ పార్టీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్‌గా జివిఎంసి 5వ వార్డు, మధురవాడ నగరపాలెం ప్రాంతానికి చెందిన ఇల్లిపిల్లి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ తానన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి వెంకటరామారావు, కో ఆర్డినేటర్ రవికిరణ్ పాల్గొన్నారు

మెట్లు ఎక్కని... ఫుట్ ఓవర్ బ్రిడ్జి!

దిష్టిబొమ్మలా ఫుట్ ఓవర్ నిర్మాణానికి వేసిన పిల్లర్

- ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రతిపాదనతో అటకెక్కిన నిర్మాణం
- పదేళ్లకు పైగా పిల్లర్లకే పరిమితమైన పనులు
- పాత గాజువాక జంక్షన్‌లో పాదచారుల అవస్థలు

ప్రజాశక్తి -గాజువాక : నిత్యం వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉన్న పాత గాజువాక జంక్షన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వాహన రద్దీ నియంత్రణతోపాటు తరచూ జరిగే ప్రమాదాల నుంచి పాదచారులకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో పుష్కరకాలం క్రితమే ఈ జంక్షన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ, పనుల్లో పురోగతి లేదు. ఫుట్‌ఓవర్ నుంచి ఫ్లైఓవర్‌కు ప్రతిపాదనలు మారినా, కార్యాచరణలో పనులు జరగక పోవడంతో, తాత్కాలిక చర్యల్లో భాగంగా ఇక్కడ కూడలిని కాస్తా విస్తరించి చేతులు దులుపుకున్నారు. ఇన్ని జరిగినా ఇక్కడ పాదచారుల కష్టాలకు విముక్తి లభించడం లేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గాజువాకలో పాతగాజువాక కూడలికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది లారీలు, బస్సులు, ఇతరత్రా వాహనాలు ఈ కూడలి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక ఈ కూడలిలో అనేక విద్యాసంస్థలు ఉండడంతో పాటు, వాణిజ్యపరంగా నగరాన్ని తలదన్నేలా వ్యాపారసంస్థలు వెలియడంతో విపరీతమైన వాహనరద్దీతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. లెక్కలేనన్ని వాహన రాకపోకలతో నెలకొన్న రద్దీతోపాటు విద్యార్థులు వేలసంఖ్యలో ఉదయం సాయంత్రం వేళల్లో ఈ కూడలి నుంచే రాకపోకలు సాగించే పరిస్థితి ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

పాదచారుల రద్దీని నియంత్రణ, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పదేళ్ల క్రితం రూ.10 లక్షలతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కావడం, నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య శంకుస్థాపన చేయడం, నిర్మాణ పనులు ప్రారంభమై పిల్లర్లు వేయడం కూడా జరిగింది. ఇంతలో పాత గాజువాకలో ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన వచ్చి, సర్వే కూడా చేపట్టడంతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కొండెక్కిపోయింది. తర్వాత రోజుల్లో జాతీయ రహదారిలోని వాహనాలను పెందుర్తి మీదుగా బైపాస్‌కు మళ్లించడంతో ఇక్కడ వాహన రద్దీ కొద్దిగా తగ్గడంతో ఫ్లైఓవర్ అవసరం లేదని అధికారులు తేల్చడంతో ఇటు ఫ్లైఓవర్, అటు ఫుట్ ఓవర్ రెంటికి చెడిన రేవడిలా మారింది. తర్వాత నిర్మాణ అంచనాలు పెరగడంతో పిల్లర్లు వేసిన కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రాకపోవడం, కాలక్రమేణా అంతా కనుమరుగైపోయింది. అయితే ఇక్కడ పాదచారుల కష్టాలు నాటికీ, నేటికీ యథావిధిగానే కొనసాగు తున్నాయి.

ఇటీవల ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు కొన్ని చర్యలు చేపట్టినప్పటికీ, పాదచారుల ఇబ్బందులు మాత్రం తొలగిపోలేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ప్రయాణికులు వందల సంఖ్యలో ఉండడంతో నేటికీ రోడ్డు దాటాలంటే బిక్కుబిక్కుమనే పరిస్థితి ఉండనే ఉంది. తరచూ ప్రమాదాలు జరగడం, ఈ జంక్షన్‌లో పరిపాటిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా ఫుట్‌ఓవర్ నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

స్టీల్ కార్మికుల నూతన వేతనాలు అమలుకు
జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం :విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల నూతన వేతనాల అమలుకు ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్ స్థానిక నాయకులు సంబంధిత జాతీయ నాయకులపై ఒత్తిడి చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. బుధవారం స్టీల్ సిఐటియు కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 29,30తేదీల్లో దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులు చేపట్టనున్న సమ్మెకు సంబంధించి యాజమాన్యానికి ఇప్పటికే నోటీసు పంపించారని, దీనిలో ప్రధాన డిమాండ్‌గా ఉక్కు కార్మికులకు నూతన వేతనాల అంశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న జరుగనున్న ఎన్‌జెసిఎస్ సమావేశంలో జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. స్టీల్ కార్మికుల నూతన వేతనాల అమలుకు అడ్డుగా నిలిచిన క్లాజ్ నెంబర్ 8ని ఉపసంహరించుకునేలా సెయిల్ యాజమాన్యంపై ఒత్తిడి చేయాలని ఇప్పటికే జాతీయ నాయకత్వం దృష్టికి స్టీల్ సిఐటియు పెట్టిందన్నారు. స్టీల్ ఎన్‌జెసిఎస్ సంఘాల స్థానిక నేతలు కూడావారి జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేయాలని సూచించారు. స్టీల్ యాజమాన్యం వైఖరిని మార్చుకునేంత వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు బి అప్పారావు, టివికె రాజు, బిఎన్ మధుసూదన్, శ్రీనివాసులరెడ్డి, వివిధ విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో ఎన్‌టిఆర్ వర్ధంతి నిర్వహించాలి

ప్రజాశక్తి -గాజువాక : ఈనెల 18వన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు అన్న నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గాజువాక నియోజవర్గంలో అన్ని వార్డుల్లోనూ ఘనంగా నిర్వహించాలని టిడిపి గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 18న ఉదయం గాజువాక పార్టీ కార్యాలయంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 9.30 గంటలకు అగనంపూడి దరి తెలుగుదేశం పార్టీ పైలాన్ వద్ద ఎన్‌టిఆర్‌కు విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నివాళులర్పిస్తారని, పార్టీ కుటుంబ సభ్యులు. నందమూరి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పద్మనాభం : ఈ నెల 18న గురువారం పద్మనాభం జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఎన్‌టిఆర్ వర్ధంతి నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని టిడిపి మండల అధ్యక్షులు కోరాడ రమణ తెలిపారు. మండల, గ్రామస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

షర్మిల నియామకంపై హర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిలారెడ్డి నియామకంపై భీమిలికి చెందిన పిసిసి సభ్యులు టి రామదాసు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వంపై అన్ని తరగతుల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు.

యుద్ధప్రాతిపదికన మరుగుదొడ్లు శుభ్రం

'ప్రజాశక్తి' కథనానికి జివిఎంసి అధికారుల స్పందన

శివాలయం దరి మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు శివాలయం ఎదురుగా ఉన్న మరుగుదొడ్లతోపాటు అక్కడి పరిసరాలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రపరిచారు. ఈ మరుగుదొడ్ల అధ్వాన్నస్థితిపై 'నిర్వహణలో నిర్లక్ష్యం' శీర్షికన ప్రజాశక్తిలో సోమవారంకథనం ప్రచురితమైన నేపథ్యంలో జివిఎంసి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్పందించారు. మరుగుదొడ్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని, వెంటనే శుభ్రపరచాలన్న జెడిసి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి మహాలక్ష్మీనాయుడు, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శి శివ మరుగుదొడ్లను పరిశీలించారు. సంబంధిత కేర్ టేకర్‌తో వెంటనే శుభ్రపరిచేలా చర్యలు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని కేర్ టేకర్‌కు సూచించారు. ఈ సందర్భంగా జివిఎంసి భీమిలి జోన్ఎఇ సుమన్ స్పందిస్తూ, సంబంధిత మరుగు దొడ్ల వద్ద రన్నింగ్ వాటర్ సదుపాయం కోసం ఏర్పాటు చేసిన మోటారు గతంలో చోరికి గురైందని, తర్వాత అమర్చిన మోటారు మరమ్మతు లకు గురవ్వడం, చిన్నపాటి సాంకేతిక సమస్యల వలన అప్పుడప్పుడు రన్నింగ్ వాటర్ సమస్య తలెత్తిందని, ప్రస్తుతం అటువంటి సమస్య ఏమీ లేకుండా సరిచేసినట్లు వివరించారు

రన్నింగ్ వాటర్ పునరుద్ధరించి శుభ్రం చేసిన మరుగుదొడ్డి

పలు మరుగుదొడ్లు కూల్చివేత :ఎఇ

ఇప్పటికే వివిధ కారణాలతో నిరుపయోగంగా ఉన్న రామన్నపేట, చిట్టివలస జెడిపి హైస్కూల్‌కు ఎదురుగా, శ్రీనగర్‌లో ఉన్న మరుగుదొడ్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చేసే యోచనలో ఉన్నట్లు జివిఎంసి, ఒకటో జోన్ ఎఇ ఎ.సుమన్ ప్రజాశక్తికి తెలిపారు. ప్రతి వార్డులోనూ ఇంటింటా వ్యక్తి గత మరుగుదొడ్లు నిర్మించుకున్న నేపథ్యంలో సామాజిక మరుగుదొడ్ల ఏర్పాటు ఆవశ్యకత లేదన్నారు. దీంతో పలు సామాజిక మరుగుదొడ్లు అనివార్యంగా నిరుపయోగంగా మారాయన్నారు. శిథిలావస్థకు చేరిన, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్ల స్థానంలో సామాజిక భవనాలను నిర్మించే యోచనలో ఉన్నట్లు తెలిపారు.

మహోన్నత నేత జ్యోతిబసు

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నో ఉన్నతమైన అవకాశాలున్నా వాటిని వదులుకొని కార్మికవర్గ రాజ్య స్థాపన కోసం కమ్యూనిస్టు పార్టీలో చేరి, తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసిన మహోన్నత నేత జ్యోతి బసు అని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమనేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ జ్యోతిబసు 14వ వర్ధంతి సభ బుధవారం అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు అధ్యక్షతన జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పాటు, వరుసగా 5 సార్లు పనిచేసి రికార్డు నెలకొల్పారని తెలిపారు. 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా పార్టీ నిర్ణయమే శిరోధార్యమని భావించి తిరస్కరించిన మహోన్నత నేత జ్యోతి బసు అని పేర్కొన్నారు. 1914 జులై 8న కోల్‌కతాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన ఇంగ్లాండులో న్యాయశాస్త్రంలో విద్యనభ్యసించారని తెలిపారు. ఆ సమయంలోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడై రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నారని, కార్మికోద్యమ నేతగా ఎదిగారని చెప్పారు. సమాజ సేవ కోసం కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారన్నారు. బి.సి.రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసనసభలో ప్రతిపక్షనేతగా వ్యవహరించారని తెలిపారు. దేశంలోనే భూ సంస్కరణలు అమలు చేసి పేదలకు భూములు పంచారని చెప్పారు. అనేక కార్మిక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, నాయకులు ఉమా మహేశ్వరరావు, కె.తెల్లయ్యబాబు, శివాజీ, చలపతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబసు వర్ధంతి సభ

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జ్యోతిబసు 14వ వర్ధంతి సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతిబసు చిత్రపటానికి సిపిఎం నాయకులు జివిఎన్.చలపతి, సిహెచ్ఎల్ఎన్.శాస్త్రి, ఎ.వి.పద్మావతి, డాక్టర్ బి.గంగారావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్‌లో జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ఉండగా పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ స్వతంత్రను కాపాడుకునే వ్యవస్థను ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రజలకు మంచి పరిపాలన అందించిన పరిపాలనా దక్షుడని కొనియాడారు. 23ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసి ఆ పదవిని తరువాతి తరానికి అందించిన గొప్ప మహనీయుడన్నారు. పార్టీ నిర్ణయాలను తూచా తప్పకుండా అమలుచేసిన గొప్ప కమ్యూనిస్టు, నిరాడంబరుడు, అధ్యయనశీలి అని కొనియాడారు. బెంగాల్, త్రిపుర రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వాలను పడగొట్టాలని పెట్టుబడిదారులు, మతతత్వ శక్తులు తీవ్ర కృషిచేశాయని తెలిపారు. నేడు కేరళను కూడా వామపక్ష ప్రభుత్వంపై పెద్దఎత్తున దాడికి దిగుతున్నాయన్నారు. వామపక్షప్రభుత్వం బెంగాల్‌లో ఉన్న కాలంలో మతఘర్షణలకు తావివ్వకుండా పరిపాలన సాగిందని గుర్తుచేశారు. నేడు దేశంలో మతతత్వ శక్తులు పుంజుకోవడంతో దేశభద్రతకు, లౌకికతత్వానికి పెద్దప్రమాదం ఏర్పడిందన్నారు. అంతరాలు లేని సమాజం కోసం నేడు ప్రజలను కదిలించి దోపిడీ వ్యవస్థను కూల్చడం, మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టడమే నేడు మనముందున్న సవాల్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పీతల అప్పారావు, వి.తులసీరాం, దండునాగేశ్వరరావు, ఎం.ప్రదీప్, జివి.రమణ, రమాప్రభ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో జ్యోతిబసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ కిశోర్

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- మునగపాక

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ, హెచ్ఐవి అధికారి డాక్టర్ కిషోర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై ఆరా తీశారు. పరీక్షలు మందులు గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ అన్ని జాతీయ కార్యక్రమాలు శత శాతం పూర్తి చేయాలన్నారు. లెప్రసీ సర్వే పూర్తి చేసి యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో లెప్రసీ సర్వే జరిగిన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ శబ్నం, సిహెచ్ఓఆర్ దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం ఉమా మహేష్, సిబ్బంది రాజేశ్వరి, తులసి, శిరీష, ఏఎన్ఎం దేవకి, ఆరోగ్య కార్యకర్త వి జగన్నాథరావు, ఆశా కార్యకర్త మారిశెట్టి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

పేదల ఇళ్లకు సమీపంలో ఉన్న సచివాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకే వైద్యనిపులు వచ్చి అత్యంత ఆధునిక ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షణ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనకాపల్లి 82వ వార్డు విజయరామరాజుపేట సచివాలయంలో బుధవారం జోనల్ కమిషనర్ వెంకటరమణతో కలిసి వైద్య సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడా, ఎన్నడూ లేని విధంగా పేద, మధ్యతరగతి వారికి ఉచితంగా సమీపంలోకి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పలకా సత్యనారాయణ, శ్రీనూకాంబిక దేవస్థానం డైరెక్టర్ ఆడారి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ మునూరు శ్రీనివాసరావు, యువజన విభాగం పట్టణ శాఖ అధ్యక్షులు వేగి త్రినాద్, వైసిపి నాయకులు దొడ్డి హరిబాబు, పొలమరశెట్టి మోహన్, చవితిన నూకరాజు, చింతా రాంజీ, పెంటకోట శ్రీనివాసరావు, ఎపిడి దొర, వీధి విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మందులు అందజేస్తున్న జానకీరామరాజు తదితరులు

బొడ్డపు ప్రసాద్‌ను సత్కరిస్తున్న అతిథులు

ఘనంగా బొడ్డపు ప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ 83వ డివిజన్ ఇంచార్జ్ బొడ్డపు ప్రసాద్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అనకాపల్లి స్థానిక వెల్లులవీధి సీతారామ కళ్యాణ మండపంలో టిడిపి బీసీ సాధికారత సమితి కన్వీనర్ మళ్ళ సురేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, చలనచిత్ర దర్శకులు నక్కిన త్రినాథరావు, సినీ నటులు మొల్లేటి బాలాజీ, ప్రసన్న కుమార్, జబర్దస్త్ సత్తిపండు, దర్శకులు ఆడారి మూర్తి సాయి హాజరై కేక్ కట్ చేయించారు. ప్రముఖులు సమక్షంలో భారీ గజమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో 84వ డివిజన్ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీలబాబు, 80వ డివిజన్ ఇంచార్జ్ బొడ్డెడ జోగినాయుడు, 82వ డివిజన్ ఇంచార్జ్ పోలారపు త్రినాథ్, టిడిపి నాయకులు కాయల మురళీధర్, గొంతున శ్రీనివాసరావు, దొడ్డి శీను, కొణతాల రత్నకుమారి, పిట్ట రాజు, దాడి జగన్, పొలిమేర ఆనంద్, ప్రసాద్ మిత్రమండలి సభ్యులు నూకరాజు (కమాండో), రవిశంకర్, చిట్టి, ఉమామహేశ్వరరావు, శీను, బాలాజీ, నాగు, దొడ్డి రాము, రియాజ్, వాకాడ మదన్, వేల్పులవీధి పెద్దలు, పురప్రజలు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

300 మందికి చీరలు పంపిణీ

ప్రజాశక్తి- సబ్బవరం

పెందుర్తి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి గొర్లి రామునాయుడు జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేసి, 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, గేదెల స్వరూప్, రెడ్డి రామునాయుడు, జ్యోతి నాదెళ్ళ, గొర్లి సత్య ప్రసాద్, ఆకాష్ పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా ఓటర్ల తుది జాబితా ఈనెల 22వ తేదీన ప్రకటించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను పరిశీలించడం జరిగిందని, 26 కేంద్రాలలో వికలాంగులకు సంబంధించి ర్యాంపులను నిర్మించవలసి ఉన్నదని చెప్పారు. త్వరలోనే వాటిని పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఓటర్ల అవగాహన సదస్సులు 914 ప్రదేశాలలో నిర్వహించాల్సి ఉండగా ఇప్పటివరకు 459 ప్రాంతాలలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే తమకు తెలియ జేయాలన్నారు. వాటిని గూర్చి వివరించి, అవసరమైతే తగిన విధంగా పరిష్కరించడం జరుగు తుందని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంలో అన్ని రాజకీయ పార్టీల వారు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి. శ్రీనివాసరావు (టిడిపి), ఐఆర్ గంగాధర్ రావు (వైసిపి), కె.హరినాథ్ బాబు (ఆప్ ఆద్మీ), ఎస్.వి.వి. రామచంద్రరావు (బిఎస్పీ) పి నాగేశ్వరరావు (బిజెపి) ఎన్నికల విభాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, డిటి రవికుమార్, ఎస్.ఎ.తులసీరామ్ పాల్గొన్నారు.

సిటీ బస్సు పాస్‌లు అనకాపల్లి వరకు పొడిగించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జీవీఎంసీలో విలీనమైన నేపథ్యంలో సిటీ బస్ పాస్‌లు అనకాపల్లి వరకు పొడిగించాలని, అనకాపల్లి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లోకి హైవే మీదుగా వెళ్లే సూపర్ ఫాస్ట్ బస్సులను అనుమతించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్ధరాత్రి హైవేలో బస్సు దిగి కాంప్లెక్స్ రావడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అర్థం చేసుకొని సూపర్ ఫాస్ట్ బస్ సర్వీసులను అనకాపల్లి కాంప్లెక్స్‌కి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిటీ బస్ పాస్‌లు లంకెలపాలెం నుండే పని చేస్తున్నాయని, దీంతో అనకాపల్లి నుండి లంకెలపాలెం వరకు టికెట్ తీసుకోవాల్సి వస్తుందని చెప్పారు. అనకాపల్లి గ్రేటర్ విశాఖలో పరిధిలో ఉన్నందున అనకాపల్లి వరకు ఈ పాస్‌ను పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, ముగడా అప్పారావు, భరిణికాన సూరిబాబు, పవన్ సాయి, ముగడ చరణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా నిరసన తెలుపుతున్న దృశ్యం

వడ్డాదిలో ఉద్రిక్తం

- కోడి పందేల వద్ద వివాదం
- పలు మార్లు ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ
- కోడికత్తితో దాడి చేయడంతో యువకునికి తీవ్ర గాయాలు
- నిందితులను శిక్షించాలని బాధిత గ్రూపు ఆందోళన

వడ్డాదిలో ఆందోళన చేస్తున్న మహిళలు

గాయపడిన తేజ

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. కోడి పందేల శిబిరం వద్ద మంగళవారం వడ్డాదికి చెందిన యువకుల మధ్య చోటు చేసుకున్న స్వల్ప వివాదం కత్తిపోటుకు దారితీసింది. దీంతో నిందితులను శిక్షించాలని వడ్డాది రెల్లివీధికి చెందిన బాధిత గ్రూపు యువకులు, మహిళలు బుధవారం వడ్డాదిలో ఆందోళనకు దిగారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

కనుమ పండగ సందర్భంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది -మంగళాపురం గ్రామాల మధ్య పొలాల్లో మంగళవారం కోడిపందేలు నిర్వహించారు. ఈ పందేలకు వడ్డాదికి చెందిన యువకులు వెళ్లారు. అక్కడ తేజ, శ్రీరామ్ గ్రూపుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇది తీవ్రమై ఇరు వర్గాల మధ్య తోపులాటకు దారితీసింది. దీంతో స్థానికులు వారిని అక్కడి నుండి పంపించేశారు. బిఎన్ రోడ్లో సాయిబాబ గుడి వద్ద మరో మారు రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు గ్రూపుల వారు ఒకరికొకరు ఛాలెంజ్ చేసుకున్నారు. అక్కడ ఉన్న కొంతమంది వ్యక్తులు వారిని సముదాయించి పంపించేశారు. మంగళవారం రాత్రి వడ్డాది సినిమా హాల్ వద్ద తిరిగి ఇరు గ్రూపులు ఘర్షణకు దిగాయి. ఈ నేపథ్యంలో శ్రీరామ్ కోడి కత్తితో తేజపై దాడి చేయడంతో తేజ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో తేజను చోడవరం ప్రభుత్వ హాస్పటల్‌కి తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. దీంతో వడ్డాదిలో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. తేజపై కోడి కత్తితో దాడి చేయడాన్ని నిరసిస్తూ స్థానిక చెరుకు కాటా ఎదురుగా బిఎన్ రోడ్డుపై బాధితుని వర్గానికి చెందిన వారు బుధవారం ఆందోళన చేశారు. దీంతో బిఎన్ రోడ్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ డి.ఈశ్వరరావు సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. డిఎస్‌పి వి.సుబ్బరాజు, కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు వడ్డాది చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గాయపడిన తేజకు న్యాయం చేయాలని వడ్డాది జంక్షన్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. తేజపై దాడి చేసిన ఏడుగురు యువకులను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని డిఎస్‌పి సుబ్బరాజును కోరారు.

రక్తదానం చేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

రక్తదానం ప్రాణ దానంతో సమానం

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

రక్తదానం చేయడం ఒకరికి ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. సామాజిక సమతా సంకల్పం మహెూత్సవాల్లో భాగంగా బుధవారం ఎన్టీఆర్ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్త దానం చేశారు. రక్తదానం చేసినట్లయితే మన శరీరంలో రక్తం తగ్గకపోగా కొత్త రక్తం చేకూరుతుందన్నారు. ఆరోగ్యవంతులైన వారందరూ రక్తదానం తప్పక చేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఏ.హేమంత్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, డిఆర్‌డిఏ పిడి శచీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ ఏడి అజయ్ బాబు, డివిఎంసి మెంబర్ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-దేవరాపల్లి : విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఈ నెల 19న జరుగు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.400 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు అగ్ర పీఠం వేసి గౌరవిస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ స్మృతి వనం, విగ్రహావిష్కరణ మహోత్సవానికి అంబేద్కర్ వాదులు, ఎస్సి, ఎస్టి, బిసి మైనార్టీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- మునగపాక

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన సంక్రాంతి సంబరాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శరగడం జగదీష్, మల్ల లక్ష్మీనారాయణ, కాండ్రేగుల వెంకట అప్పారావు మిత్ర బృందం సహాయ సహకారాలతో గ్రామంలోని యువకులు, వృద్ధులు, గృహిణులు, పిల్లలు వారి వారి కళా ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. సంక్రాంతి సంబరాలను వీక్షించేందుకు విచ్చేసిన దర్శకులు నెక్కిన త్రినాధరావు, సినిమా, టీవీ నటులు బాలాజీ, ప్రసన్న కుమార్ రెడ్డి, కళాభిమాని, నాగార్జున ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షులు మల్ల సురేంద్ర తదితరులు వారితో ఆడి పాడారు. గ్రామస్తులు జరిపిన కళా ప్రదర్శనలను కొనియాడారు. అనంతరం గ్రామానికి చెందిన రంగస్థలం నటులు ఆడారి సూరిబాబు, సినీ దర్శకులు నెక్కిన త్రినాధరావులకు పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భీమిశెట్టి మంగ లక్ష్మి కృష్ణారావు, డాక్టర్ ఉమా శంకర్, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు మల్ల స్వామి, సరగడం వెంకునాయుడు, కొయిలాడ శివాజీ, పెంటకోట మహాలక్ష్మి నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ సరగడం నాయుడు, పెంటకోట రామప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కోలాటం ఆడుతున్న మహిళలు, తిలకిస్తున్న అతిథులు

టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలు

టిడిపి కండువాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఎన్.గజపతినగరం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆధ్వర్యంలో బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ కుమారుడు చిరికి రాజేష్, బొడ్డు సింహాద్రిప్పుడు, కుంది దేముడు, కుంది గంగునాయుడు తదితరులకు రామానాయుడు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నారి తల్లమ్మ తీర్థం మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ కమిటీ సభ్యులు రామానాయుడుని సాలువతో సత్కరించి నారి తల్లమ్మ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు గంధం జగన్, పెద్దాడ రమణ, సోమిరెడ్డి గోవిందా, వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ అప్పలనాయుడు, ఎన్‌జి నగరం గ్రామ అధ్యక్షులు పాచిల కృష్ణ, బొడ్డు అప్పలనాయుడు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆల్ ఆంధ్ర మ్యాజిక్ ఫ్రెండ్స్ డ్రైవర్స్ గ్రూప్ సభ్యుడు బాబ్జి గత ఆదివారం అకాల మరణం చెందగా, గ్రూపు తరపున బుధవారం శ్రద్ధాంజలి ఘటిస్తూ బాబ్జి కుటుంబానికి సభ్యుల నుండి సేకరించిన రూ.60,011 ఆర్థిక సాయం అందించారు. గ్రూపు అడ్మిన్స్ అయిన కొయ్యలగూడెం సత్యనారాయణ, ముమ్మిడివరం త్రిమూర్తులు, అన్నవరం కొండబాబు, నర్సీపట్నం అశోక్, అనకాపల్లి ప్రసాద్, అచ్యుతాపురం శీను, అచ్చుతాపురం స్టాండ్ ప్రెసిడెంట్ వర బాబు, స్టాండ్ సభ్యులు పాత గాజువాక ప్రసాద్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బాబ్జి కుటుంబానికి ఈ మొత్తం అందజేశారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్

అమర్‌నాథ్ ఎక్కడ పోటీ చేసినా ఓటమి ఖాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎక్కడ నుండి పోటీ చేసినా ఓటమి తథ్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి అమర్నాథ్ అనకాపల్లి నియోజకవర్గ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, చంద్రబాబు గురించి మాట్లాడే హక్కు అమర్నాథ్‌కు లేదని పేర్కొన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టించిన వైసీపీ ప్రభుత్వం, సిఐడి అధికారులు ఆధారాల్లేక కోర్టులో చార్జిషీట్ వేయలేక నానా అవస్థలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. 11 సిబిఐ కేసులు, 6 ఈడీ కేసులు, 32 క్రిమినల్ కేసుల్లో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఎ1 ముద్దాయిగా ఉన్నారన్నారు. మెగా డీఎస్సీ, గ్రూప్ 1, 2 పోస్టులకు ప్రకటనలు మాత్రమే తప్ప గత సంవత్సరంలో ప్రకటించిన 10,416 పోస్టులు నేటికీ భర్తీ చేయలేదని తెలిపారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు ధనాల విష్ణు చౌదరి, సాలాపు నాయుడు, బోడి వెంకటరావు, బొబ్బిలి గోవింద తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు

రైవాడలో పూజలు చేస్తున్న టిడిపి నేత పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని రైవాడ గ్రామంలో ఎరకాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు స్థానిక టిడిపి నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు వారాది అప్పారావు, నాయకులు చల్లా శ్రీను, చల్లా రామకృష్ణ, వారాధి కృష్ణ, వాండ్రాసు రాము, వాండ్రాసు సత్యారావు, సానబోయన అప్పారావు, ఎడ్ల పవన్, విరోధి శివ, తొండారపు అప్పారావు, తొండారపు నాయుడు, పైలా నాయుడు, పైలా యువసేన అధ్యక్షులు గట్రెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

చౌడువాడ, గొండుపాలెం గ్రామాల్లో...

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, గొండుపాలెం గ్రామాలలో బుధవారం శ్రీదండు ముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆయా గ్రామాల ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీసుకున్నారు. మధ్యాహ్నం సాంస్కృతి కార్యక్రమాలు, సాయంత్రం మహిళల చిడతలు, భజనలు, తప్పిడి గుళ్ళు నిర్వహించారు. రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సీతారాముల తీర్థం

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు ఆధ్వర్యంలో సీతారాముల తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జరిగింది. ఈ సందర్భంగా భజనలు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు సీతారాములకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొడ్డి అప్పారావు, సూరిశెట్టి సూర్యనారాయణ, రమణ, దాడి సూరిబాబు, దొడ్డి శ్రీనివాసరావు, దాడి రామునాయుడు, బొడ్డేటి అప్పారావు, దొడ్డి రాము, ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గురువారం 18 జనవరి 2024

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి -చీడికాడ:రామాలయ పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. వైసిపి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని మాటల ప్రభుత్వం కాదని ఎప్పుడూ ప్రజాసంక్షేమం కోసమే పాటుపడుతుందన్నారు. మండలంలోని బైలపూడి గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా హెల్త్ సెంటర్, సచివాలయం భవనాలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రతి వీధిలో తిరిగి రామాలయం నుండి పాల కేంద్రం వరకు సిసి రోడ్ నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పురాతన రామాలయం శిథిలమై నందున పునర్నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించడంతో పాటు తన సొంత నిధులు లక్ష రూపాయలు ఇస్తానని ఆయన ప్రజలకు తెలిపారు. గ్రామంలో మిగిలిన సమస్యలు ఏమైనా ఉంటే అధికారులకు తెలియజేస్తే తక్షణమే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు. గ్రామ సర్పంచ్ జాజిమొగ్గల గంగ తల్లి సత్యనారాయణ వైసిపి నేతలు నారాయణమూర్తి, సోము నాయుడు, సుంకర శ్రీను, సుంకర వెంకటరావు, తోపాటు స్థానిక ఎంపీపీ నారాయణరావు, ఎంపీడీవో జయప్రకాష్ రావు, ఏవో కష్టవేణి, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, వాలంటరీలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న బూడి

మాట్లాడుతున్న పాపారావు

రిలే దీక్షను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రెల్లిలకు ఎమ్మెల్సీ కేటాయించాలని కోరుతూ ఈ నెల 20న జివిఎంసి గాంధీ విగ్రహం ఒక్క రోజు దీక్ష చేపడుతున్నట్లు రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. బుధవారం నర్సీపట్నంలో జరిగిన రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి నర్సీపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు రిష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఒక్కరోజు దీక్ష కార్యక్రమానికి రెల్లిలంతా వేలాదిగా తరలిరావాలని కోరారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి నేటి వరకు రెల్లిలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నామినేటెడ్ పదవుల్లో కూడా ప్రాధాన్యత లేదన్నారు. విద్య, ఉపాధి, సంక్షేమ అభివృద్ధి రిజర్వేషన్లలో ఎటువంటి ప్రాధాన్యత లేదన్నారు. ఐక్య ఉద్యమంతోనే హక్కులు సాధ్యమన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా శ్రీనివాసరావు, ఇల్లపు బిన్నీసులు, వడ్డాది దేవుడు, వడ్డాది అప్పలనాయుడు, భవిరిశెట్టి కన్నారావు, బంగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులుఇస్తున్న సర్పంచ్ సురేష్ వర్మ

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని నెల్లిపూడి గ్రామంలో సర్పంచ్ సురేష్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం రాత్రి బహుమతులను అందజేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కురందాసు ప్రకాష్, శ్రీను, రాజేష్, నానాజీ, శివాజీ, రమాదేవి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం పడిగాపులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం ఎస్సీ, బీసీ కాలనీ వాసులు రేషన్ బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతి నెల మొదటి వారంలో అందించవలసిన రేషన్ బియ్యాన్ని డీలర్లు, ఎండియులు ఇప్పటికొచ్చి పంపిణీ చేయలేదని విలేకరుల వద్ద వాపోయారు. రేషన్ వాహనం ఏరోజు ఏ సమయంలో వస్తుందో తెలియక కూలి పనులు మానుకొని వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రేషన్ వాహనం వచ్చినప్పటికీ బియ్యం తప్ప మిగతా నిత్యావసర వస్తువులు ఇవ్వలేదని ఆరోపించారు. నేటికి 17 రోజులు గడిచిన 120 మందికి రేషన్ బియ్యం పంపిణీ చేయలేదంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే రేషన్ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-మాకవరపాలెం:పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం సందడిగా జరిగింది. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రాచపల్లి జంక్షన్‌లోని కామేశ్వరమ్మ ఆలయం వద్ద సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వారంతా ఆనందంగా గడిపారు. చదువుకున్న సమయంలోని తీపి గురుతులను నెమరువేసుకున్నారు. ఈ సమ్మేళనంలో 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'నిందితులను శిక్షించాలి'

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: హత్యాయత్నం చేసిన నిందితులను అరెస్టు చేయాలని అనకాపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యమ్ అప్పలరాజు డిమాండ్ చేశారు. కుల వివక్షతో హత్య ప్రయత్నం చేసిన కేసుల్లో స్టేషన్ బెయిలు రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన నర్సీపట్నంలో ఒక ప్రకటన విడుదల చేశారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలోని వెంకటేశ్వర సినిమా హాలు ఎదురుగా మెయిన్ రోడ్డుపై దళిత యువకుడు భూపతి రాజా, బొర్రా తేజ లపై కత్తితో దాడి చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం బాధితులు కేజీహెచ్ లో విషమ పరిస్థితుల్లో చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నారన్నారు. నిందితులను శిక్షించాలన్నారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సంఘటనా స్థలాన్ని డీవియంసి సభ్యులు ఈశ్వరరావు పరిశీలించారు.

దళిత భూముల కబ్జాలను అరికట్టాలి

అచ్చెంనాయుడిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెంనాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడులను దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దళిత సేన, మాల మహానాడు, జిల్లా సంఘాల ఐక్యవేదిక, దళితరత్న మాల మానాడు దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వం దళితులకు చెందిన 28 సంక్షేమ పథకాలు రద్దు చేయడం దారుణమన్నారు. దళితులపై దాడులు అధికమవుతున్నాయన్నారు. దళితవాడలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు.దళితులు భూములు కబ్జాలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు నక్కెల నాగమణి, సీనియర్ నాయకులు నేతల నాగేశ్వరరావు, మాల మానాడు జిల్లా అధ్యక్షులు గూతాడ సహదేవుడు (డికెఎస్ఎస్), రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివిధ వేషధారణలో చిన్నారులు

వారపు సంతలో సందడి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని గిరిజనులు ఘనంగా పండగ వేడుకలు జరుపుకుంటున్నారు ఈ పండగ సందర్భంగా మండలంలోని కించమండ వారపు సంతలో గిరిజన సంప్రదాయమైన షేర్ బుడియాను సోబోరి నృత్యం చేస్తూ వారపు సంతలో గిరి యువత విచిత్ర వేషధారణతో సందడి చేశారు. వారపు సంతల్లోని ప్రతి దుకాణం వద్ద సోబోరి నృత్యం చేస్తూ చందాలను వసూలు చేశారు.

షేర్ బుడియా వసూలు చేస్తున్న యువకులు

సింఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని చెట్టుపల్లి గ్రామానికి చెందిన తరగంపూడి సన్యాసిరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు సన్యాసిరావు భార్య పద్మకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 2లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని మండల వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్ చెప్పారు. మండలంలోని కంద్రుమ్ పంచాయతీ కేంద్రంలో బుధవారం డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని, వైసిపి ప్రభుత్వం మాత్రం సామాన్య వ్యక్తికి కూడా మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి అంబికా రమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల్లో ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్థానిక శతకం పట్టు కళావేదికపై భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండల స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, మండల సతీష్, తవ్వ సన్యాసయ్య శెట్టి, మొవ్వ బుచ్చయ్య చౌదరి, వీనస్ కోచింగ్ సెంటర్ తాళపురెడ్డి నాగచంద్ర, భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు గౌరీ పట్టపు మహేష్ పాల్గొన్నారు.

మూసివున్న సచివాలయం

సమయం దాటినా..

తెరచుకోని సచివాలయం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని ఖండివరం గ్రామంలో సచివాలయం కార్యాలయం తలుపులు ఉదయం 10.30గంటలు దాటినా తెరుచుకోక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయం సిబ్బంది కార్యాలయానికి సమయం దాటినా కూడా రాకకపోవడంతో సచివాలయం వద్ద ప్రజలు కాపలా కాయ వలసిన దుస్థితి ఏర్పడిందని ఆ గ్రామ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఒక ప్రక్క అంగన్వాడీల సమ్మె కారణంగా అంగనవాడి కేంద్రాల విధులు కూడా సచివాలయం సిబ్బందికి అప్పగించారు. అయినప్పటికీ సచివాలయానికి సమయానికి రాక పోవడం విశేషం. అధికారులు, నాయకులు పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది విధులకు హాజరు కాలేదని ప్రజలు తెలిపారు.

సంబరాలు చేసుకుంటున్న నేతలు

కాంగ్రెస్ నేతల సంబరాలు

ప్రజాశక్తి-మాడుగుల:రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా షర్మిలను నియమించడంతో కాంగ్రెస్ పార్టీ నేతలు బుధవారం మండల కేంద్రంలోని గాంధీ పార్క్ ఆవరణలో సంబరాలు చేశారు. మాడుగుల నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ పడాల కొండలరావు మాట్లాడుతూ, షర్మిల రాకతో పార్టీలో నూతన ఉత్సాహం వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడ బండి రాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మైలపల్లి యేసు రాజు, నాయకులు జగ్గారావు, ఆర్లి ధనుంజయ్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా శ్రీకాంత్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:బుచ్చయ్యపేట మండల తహసిల్దార్‌గా కే.శ్రీకాంత్‌ను నియామకం చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం కలెక్టరేట్లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్ ను బుచ్చయ్యపేట తహసిల్దార్‌గా నియమించారు. గతంలో తహసిల్దార్‌గా పనిచేసిన వెంకటేశ్వరరావు పదవి విరమణ చేయడంతో ప్రస్తుతం తహసిల్దారుగా డిటి అరుణ్ చంద్రకు బాధ్యతలు అప్పగించారు.

ఆచారాలకు ప్రతీక బలి పండగ

సందడిగా గిరిజన గ్రామాలు

ప్రజాశక్తి-హుకుంపేట:ఏజెన్సీలో తాత ముత్తాతల కాలం నుండి ఆచారంగా గిరిజనుల సాంప్రదా యంగా బలి పండగను నిర్వహిస్తున్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీ. ఈ పండుగ నిర్వహించడంతో పంటలు బాగా పండుతాయని... కోరుకున్న కోరికలు తీరుతాయన్నది గిరిజనుల నమ్మకం. ఏజెన్సీ ప్రాంతంలోని పలు మండలల్లో బలి పండుగను నిర్వహిస్తారు. మొక్కజొన్న, గోధుమలు విత్తనాలు తడిపి 11 రోజుల్లో మొలకెత్తినవి ఒక బుట్టిలో వేసుకొని గ్రామ దేవత దగ్గరకు తీసుకొచ్చి పండుగ నిర్వహిస్తారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి గిరిజన సంప్రదాయ బద్దంగా నిర్వహిస్తారు. డిసెంబర్ నెల ఆఖరి నుండి జనవరి నెల వరకు దీనిని నిర్వహిస్తుంటారు.

షోకాజ్ నోటీసులకు సమాధానాలు

-వేతనాలు పెంచేవరకూ సమ్మె విరమించం-అంగన్‌వాడీలు

మర్రిపాలెం అర్బన్ ప్రాజెక్టు ఎదుట అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. విశాఖ, అనకాపల్లి జిల్లాలోల పలు చోట్ల వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. షోకాజ్ నోటీసులు జారీ చేసి బెదిరించడం సరికాదని పేర్కొన్నారు.

నక్కపల్లి:తమకు ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకోవాలని అంగన్వాడి వర్కర్స్ డిమాండ్ చేశారు.స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బుధవారం తమకు ఇచ్చిన నోటీసుకు వ్యతిరేకంగా అంగన్వాడి వర్కర్స్ నిరసన చేపట్టారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, సమస్యలు పరిష్కరించకుండా నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు, పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను పరిగణలోకి

మాడుగులలో..

తీసుకుని కనీస వేతనం చెల్లించాలని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగలక్ష్మీ, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో 37వ రోజు సమ్మె కొనసాగింది. షోకాజ్ నోటీసులకు సమాదానంగా ప్రాజెక్టు పిఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రాజెక్టు నాయకులు డి మహలక్ష్మీ, సామ్రాజ్యం మాట్లాడుతూ, సమ్మెకు ముందుగా నోటీసు ఇచ్చి సమ్మెను ప్రారంభించామని, తమ నాయ్యమైన డిమాండ్లను పరిస్కరించకుండా సమ్మెను అణచి వేయుడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎస్మాను ప్రయోగిచడం అన్యాయమన్నారు.

అంగన్వాడీల బైఠాయింపు.

మాడుగుల: మాడుగుల ఎస్సీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు బైఠాయించారు. బుధవారం బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీలు తలపెట్టిన నిరసన 37వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలు ర్యాలీని నిర్వహించారు. మాడుగుల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంకు చేరుకొని షోకాస్ నోటీసులకు సమాధానం తీసుకోవాలని మాడుగుల ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మాడుగుల, చీడికాడ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ బైఠాయించారు. ప్రాజెక్ట్ అధికారి సానుకూలంగా స్పందించకపోగా న్యాయపరమైన సమస్యలపై పోరాడుతున్న తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వం ఉద్యోగంలో నుండి తీసివేస్తే ఏమి చేయగలరని బెదిరిస్తున్నారని అంగన్వాడి మాడుగుల మండల అధ్యక్షురాలు బేతా భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే కార్యాలయం వద్ద నుండి వెళ్లిపోవాలని ప్రాజెక్టు ఆఫీసర్ తెలిపినట్లు సిఐటియు కార్యదర్శి రొంగల దేవుడు నాయుడు తెలిపారు.

ఆకులు తింటూ వినూత్న నిరసన

మునగపాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 37 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు రోజుకొక విధంగా వినూత్నంగా నిరసన తెలుపుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రం మునగపాకలోని దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు ఆకులు నములుతూ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన తెలియజేశారు. ఈ శిబిరాన్ని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్మా, షోకాజ్ నోటీసులు వంటివి జారీ చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, అంగన్వాడీ యూనియన్ నాయకులు జయలక్ష్మి, రామలక్ష్మి, హేమలత, అంజలి, సరస్వతి, తులసి లక్ష్మి, గంగాభవాని, సత్యవతి, రేణుక పద్మ, లక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

రాంబిల్లి : రాంబిల్లి తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో 37వ రోజు ఆందోళనలో భాగంగా అంగన్వాడీలు నోట్లో ఆకులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడు నాయుడు మాట్లాడుతూ, కనీస వేతనం పెంచి, అంగన్వాడీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంగ, సుజాత,

మునగపాకలో...

సావిత్రి, సంతోషి, నూకరత్నం, రమణమ్మ, లక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ నాయకులు జి కుమారి, పి.భవాని మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

షోకాజ్ నోటీసులకు సమాధానాలు

కశింకోట : అంగన్వాడీలకు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులకు సమాధానం ఇస్తూ అనకాపల్లి జిల్లా కసింకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సిడిపిఓ ప్రభావతికి అంగన్వాడీ యూనియన్ నాయకులు సమాధాన పత్రాలు బుధవారం అందజేశారు. అందర్భంగా ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగ శేషు మాట్లాడుతూ తాము అడుగుతున్నవి గొంతెమ్మ కోరికలు ఏమి కావని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, కసింకోట మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అంగన్వాడీల రిలే దీక్షలు 37వ

కె.కోటపాడులో..

రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా అంగన్వాడీలు జిఓ నెంబర్2కి సమాధాన పత్రాలు ఐసిడిఎస్ అధికారులకు సమర్పించారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివి.రమణమ్మ, ఎం.వరలక్ష్మి, డి.పుష్ప, ఎస్.జగదీశ్వరి, ఆర్.శివరామ లక్ష్మీ, వి.సుభాషిణి, ఎం. కనకమ్మ, జి.అరుణ కుమారి, ఎస్. రమణమ్మ, డి. భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు లిఖితపూర్వకంగా అంగన్‌వాడీలు

నక్కపల్లిలో...

సమాధానమిచ్చారు. మర్రిపాలెంలోని అర్బన్ సిడిపిఒ కార్యాలయానికి అంగన్‌వాడీలు వెళ్లి సామూహికంగా అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షులు వై.తులసి మాట్లాడుతూ, వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరికి పోకుండా, ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.నూకరత్నం, ఎం. వెంకటలక్ష్మి, ఆర్.శ్యామల, రామలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పిఒడబ్ల్యు నాయకులు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : అంగన్వాడీల నిరవధిక సమ్మె 37వ రోజు బుధవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులతో అంగన్వాడీలు మానవహారం, నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మెకు సంఘీభావం తెలిపిన ఐద్వా జిల్లాకార్యదర్శి పద్మ మాట్లాడుతూ, షోకాజ్ నోటీసులిచ్చి భయపెట్టాలన్న ప్రభుత్వ బెదిరింపులకు అంగన్వాడీలు భయపడేది లేదని, దీనికి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారన్నారు. రానున్నరోజుల్లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో అంగన్వాడీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బృందావతి, దేవి, భవాని పాల్గొన్నారు.

పెందుర్తిలో..

సబ్బవరంలో..